2015లో మతోన్మాదశక్తులు పెచ్చరిల్లిన తీరుతెన్నులు

2015లో మతోన్మాద హింస, మత ప్రాతిపదికగా ప్రజలను చీల్చడం, తత్పర్యవసానంగా మత విద్వేషం పెరగటం పెను ప్రమాదంగా ముందుకొచ్చాయి. 2015లో మతోన్మాదం ఘటనలు 630 జరగ్గా 84 మంది మృతిచెందారు. 1979 మంది గాయపడ్డారు. అదే 2014లో 644 మతోన్మాద హింసా ఘటనలు జరగ్గా 95 మంది మృతిచెందారు. కాగా జాతీయ నేర రికార్డుల బ్యూరో 2015లో అక్టోబర్ వరకూ 1227 మత హింసా ఘటనలు జరిగాయని పేర్కొంది. అయితే కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 630 ఘటనల్లో 84 మంది మృతిచెందినట్లు పేర్కొంటూ గత ఏడాదిలో ఎలాంటి పెద్ద మతపర హింసాఘటన జరగలేదని పేర్కొన్నాడు. కేంద్ర హోంశాఖ ప్రకారం ఐదుగురు మృతిచెందితేనే పెద్ద ఘటనగా పేర్కొంటారు. (వివరాలు టైమ్స్ ఆఫ్ ఇండియా నుండి).

ఈ వివరాలనలా వుంచితే, మతోన్మాద ఘటనల సంఖ్య 2014తో పోల్చితే 2015లో పెరిగింది. మృతుల, గాయపడినవారి సంఖ్యగా చూస్తే ఘటనల తీవ్రత తగ్గింది. హిందూ మతోన్మాదశక్తులు గద్దె నెక్కటంతో ఘటనలు పెరిగి తీవ్రత తగ్గింది. అంటే తక్కువ తీవ్రత గల ఎక్కువ ఘటనలను, రెచ్చగొట్టే పద్ధతిని మతోన్మాదశక్తులు అనుసరించాయి. వివిధ మతస్తుల మధ్య వైషమ్యాలను పెంచటమే లక్ష్యంగా మతోన్మాద శక్తులు ఈ పద్ధతిననుసరించాయన్నది స్పష్టం.

మహారాష్ట్రలోని హార్ఘల్, హర్యానాలోని అతాలి, ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీతో పాటు ఈ మతోన్మాద ఘటనలన్నీ అంతవరకూ మత సామరస్యంతో జీవిస్తున్న వారిని ఈ ఘటనలోకి ఈడ్చాయి. ఆ విధంగా మత విద్వేషాన్ని సర్వసాధారణ విషయంగా చిత్రించేందుకు పూనుకున్నాయి. హిందూ, ముస్లింల మధ్య ఉండే ఉద్రిక్తత కొన్నిచోట్ల ఘర్షణలకు దారితీసిందంటూ మతోన్మాదశక్తులు అప్రధాన విషయంగా ప్రక్కనపెట్టే వైఖరిలో ఇది వ్యక్తమైంది.

2015లో ప్రధానంగా ముందుకొచ్చిన మరో అంశం – గ్రామాలు, చిన్న పట్టణాలలో మతోన్మాద ఘటనలు జరగటం, గతంలో నగరాలు, పెద్ద పట్టణాలలో జరిగేవి. గ్రామీణ ప్రాంతాలలో ఒక పద్ధతి ప్రకారం మతోన్మాద ఘటనలను పెంచి ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచి, వారిని చీల్చివేసే లక్ష్యంతో మతోన్మాద శక్తులు దీనినమలుజరిపాయి.

ఉత్తరప్రదేశ్‌లో లవ్ జీహాద్ పేరిట సాగించిన ప్రచారం, దాని కొనసాగింపుగా ముజఫర్‌నగర్‌లో ముస్లింలపై దాడులు 2014 ఎన్నికల్లో గెలుపు తెచ్చిపెట్టాయని మతోన్మాదశక్తులు తక్కువ తీవ్రతల ఎక్కువ ఘటనలను కొత్త ప్రాంతాలకు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో సాగించే ఎత్తుగడ ననుసరించాయి.

2015లో బీహార్ ఎన్నికలు, 2017లో జరిగే ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పైన పేర్కొన్న పద్ధతిని ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానాలలో మతోన్మాదశక్తులు అనుసరించాయి. ఓట్లు పొందాలన్న తాపత్రయంతో మిగిలిన పాలకవర్గపార్టీలు ఈ పద్ధతి నెదుర్కోకుండా చూస్తూ వుండిపోయి పరోక్ష మద్ధతునిచ్చాయి.

మతోన్మాద ఘటనలలో 86 శాతం (హోంశాఖ లెక్కల ప్రకారం) ఎనిమిది రాష్ట్రాల్లో జరిగాయి. అవి : మహారాష్ట్ర, గుజరాత్, బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ. ఈ ఘటనలను ప్రేరేపించిన కారణాలు మతాంతర వివాహాలు, మసీదు నిర్మాణం, మత ఊరేగింపులు, రెండు మతాలకు చెందిన వ్యక్తుల మధ్య తగాదాలు. 2015లో గో వధ అన్న అంశం వీటికి చేరింది.

2015లో హిందూ మతోన్మాదశక్తులు 'బేటీ బచావ్ బహు లావ్' (హిందూ కూతురును రక్షించండి, ముస్లిం కోడలిని తెచ్చుకోండి) అన్న నినాదంతో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేశాయి. ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్‌లు ఆగ్రా, దానిచుట్టుప్రక్కల ఎంత తీవ్రస్థాయిలో చేశాయంటే, ఉత్తరప్రదేశ్ మైనారిటీస్ కమీషన్ వీరిపై చర్య తీసుకోమని ప్రభుత్వాన్ని కోరాల్సి వచ్చింది. ఈ కమీషన్ నివేదిక ప్రకారం భజరంగ్‌దళ్ మహిళా కళాశాలల్లో కరపత్రాలను పంచిపెట్టింది. దానిలో ముస్లిం యువకులతో ప్రేమలో పడవద్దని హిందూ యువతులకు తీవ్ర పరిణామాలెదురౌతాయని హెచ్చరించింది. తన జీవన భాగస్వామిని ఎంచుకునే మహిళల హక్కు కాలరాచే ప్రయత్నమిది. కాగా హిందూ మతోన్మాదశక్తులు ముస్లిం యువతులను ప్రేమించి పెళ్ళిచేసుకొని, వారిని హిందువుగా మార్చమని హిందూ యువకులను ప్రోత్సహించాయి. ఇంత విషం గక్కాక, ఘర్‌వాపసీ పేరిట (ముస్లింలను తిరిగి హిందువులుగా మార్చటం) ఆగ్రా మతపర ఉద్రిక్తత, హింసకు కేంద్రం కావటం ఊహించగల పరిణామమే.

ఇదే కాలం కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రభుత్వం తన అండదండలు హిందూ మతోన్మాద శక్తులకున్నాయని తెలిపే చర్యకు పాల్పడింది. 2011 జనాభా లెక్కలలో గణించిన మత లెక్కలలో ఎంపిక చేసిన వాటిని విడుదల చేసింది. దీనినాధారం చేసుకుని దేశంలో నానాటికీ ముస్లిం జనాభా పెరిగిపోతున్నదనీ, హిందూ జనాభా తగ్గిపోతున్నదనీ హిందూ మతోన్మాద శక్తులు ప్రచారం చేశాయి. విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ఈ శక్తులు ఎంతదూరం వెళ్ళాయంటే లవ్ జీహాద్ ద్వారా ప్రతి ముస్లిం 40 మంది పిల్లలను కంటున్నాడనీ హిందుస్తాన్‌ను దారుల్ ఇస్లాం (ముస్లిం స్వర్గం)గా మార్చేందుకు పూనుకున్నారనీ, దీనినెదుర్కోవాలంటే ప్రతి హిందూ మహిళా నల్గురు పిల్లలను కనాలనీ పార్లమెంటు సభ్యురాలైన సాధ్వీ ప్రాచీ తన వదరుబోతు తనాన్ని ప్రదర్శించింది.

పార్లమెంటు సభ్యురాలిగా రాజ్యాంగచట్టాన్ని కాపాడాల్సిన సాధ్వీప్రాచీ, చేసిన మత విద్వేషాన్ని రగిల్చే ఈ నేరపూరిత చర్యను చూస్తూ ఊరకుండిన కేంద్రం తన మద్దతు ఎటు వుందో తెలిపింది.

ఈ విషప్రచారం స్త్రీలను బిడ్డలుకనే యంత్రాలుగా చూసే ఫ్యూడలు దృక్కోణాన్ని బలపరిచింది. ఫలితంగానే పరువు హత్యల పేరిట హత్యాకాండలు పెచ్చరిల్లు తున్నాయి. అతాలిలో జరిగిన మతహింసలో జాట్ స్త్రీలు పాల్గొన్నారు. ముస్లింలపై రాళ్ళు విసిరారు. వారి యిళ్ళు తగలబెట్టారు. ఎందుకిలా చేశారని అడిగితే మా ఆడపిల్లలను ముస్లిం యువకులు ఆకర్షిస్తున్నారనీ, మసీదు కట్టుకోనిస్తే వారింకా పెచ్చరిల్లిపోతారని సమాధానం చెప్పారు. కాగా నిన్నటివరకూ తమతో కలిసిమెలిసి వున్న హిందూ స్త్రీలే తమపై దాడిలో పాల్గొనటంతో తాము అప్రతిభులమయ్యామని ముస్లిం స్త్రీలు కన్నీటితో చెప్పారు.

2015లో మతపర చీలికకు గోవధను సాధనంగా వాడారు. 2014 జూన్ నుండి 2015 అక్టోబరు వరకూ ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే గోవధ జరిగిందన్న ఆరోపణతో 330 మతహింసా ఘటనలు జరిగాయి. వీటిలో దాద్రి ఘటనకే విస్తృత ప్రచారమొచ్చింది. షహరాన్‌పూర్‌లో పశువులను వధ్యశాలకు తరలిస్తున్నారన్న అనుమానం కలిగినందుకు నల్గురు అమాయక యువకులను చంపివేశారు. దేశవ్యాపితంగా గోవధ అంశాన్ని మత ఉద్రిక్తతలను పెంచేసాధనంగా ఈ కాలంలో మతోన్మాద శక్తులు వాడాయి.

ఈ పద్ధతుల్లో రెచ్చగొట్టిన మత విద్వేషాలను శాశ్వత విభజనగా చేసేందుకు సాంఘిక బహిష్కరణను సాధనంగా మతోన్మాదశక్తులు వాడాయి. అతావీలో మతఘర్షణలతో గ్రామం వదలిపోయిన ముస్లింలు తిరిగిరాగా, వారిపై సాంఘిక బహిష్కరణను విధించారు. శ్రామికులుగా వున్న ఈ ముస్లింలను పొలాల్లో పనిచెయ్యనివ్వలేదు. వారికి; వారి పిల్లలకు పాలతోసహా నిత్యావసర సరుకులు అమ్మనివ్వలేదు. వారు తయారుచేసిన సరుకులు కొననివ్వలేదు. ముస్లింలను ఆకలికి, దిక్కులేనితనానికి లోనుచేశారు. దీనికి మూలం ముస్లింలలో కొందరు ఆర్థికంగా బలపడటం ఫ్యూడలు సంబంధాలకు గండికొడుతోంది. అందుకనే ముస్లింల ఆస్తులు కొల్లగొట్టటం పెద్దస్థాయిలో జరిగింది.

గత ఏడాదిలో హిందూ మతోన్మాదశక్తులు కొత్త సంస్థలను పుట్టించాయి. ఆర్ఎస్ఎస్ కార్యకర్తే దాద్రీలో ఇలాంటి కొత్త సంస్థకు కార్యదర్శి. ఇతనే దేవాలయ పూజారిని బయటి నుండి తెచ్చి నియమించాడు. అతనే గోవధ జరిగిందని దేవాలయంలోని మైకు నుండి ప్రచారం చేశాడు. ఆరోపణ ఆధారంగా మహమ్మద్ అక్‌లాక్‌ను చంపారు. ఇంతకీ అతనింట్లో వున్నది గోమాంసంకాదని పరిశోధనశాల తేల్చింది. ఆర్ఎస్ఎస్ మాత్రం ఈ హత్యకు తమ సంస్థతో సంబంధం లేదని ప్రకటించింది. తన శక్తులతో మతహింసను సాగించటం, విమర్శలొస్తే తమకు సంబంధంలేదనటానికి వీలుగా కొత్తసంస్థలు పెట్టటం ఒక పద్ధతిగా పాటించాయి.

చివరిగా నేర పరిశోధన (పోలీసు), న్యాయ వ్యవస్థల తీరును పేర్కొనాల్సి వుంది. మత ఘటనలు జరుగవచ్చునన్న సూచనలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నప్పటికీ, పోలీసులు చాలా సందర్భాల్లో నిరోధించే చర్యలను తీసుకోలేదు. అతాలి ఘర్షణల తర్వాత బల్లభ్‌ఘర్ పోలీసుస్టేషన్‌లో ముస్లింలను ఉంచుకొని పదిరోజుల పాటు వారికి రక్షణ కల్పించారు. అయితే బాధితులు దాడిచేసిన వారిని గుర్తించినా వారిని అరెస్టుచేసేందుకు ప్రయత్నం చేయలేదు. దాద్రీలో మహమ్మద్ అక్‌లాక్ ఇంట్లో మాంసం గోవుదో కాదో తేల్చేందుకు లాబ్‌కు పంపారు. కానీ దాడికి పాల్పడినవారిని అరెస్టుచేసేందుకు పూనుకోలేదు. పైనుండి వచ్చే ఆజ్ఞలతో, పోలీసులు ప్రేక్షకులుగా వుండిపోవటంతో హిందూ మతోన్మాద శక్తులు పేట్రేగిపోతున్నాయి.

న్యాయవ్యవస్థ సత్వర న్యాయాన్ని అందించటంలో పూర్తిగా విఫలం చెందుతున్నది. 2002 గుజరాత్ మారణకాండలో నేరస్తులుగా గుర్తించి శిక్షలు విధించిన వారందరినీ హైకోర్టులు విడిచిపెట్టాయి. క్రింది నుండి పై స్థాయి నేతవరకూ ఒక్కరు కూడా జైలులో లేరు. హషింపూర్‌లో అమాయక ముస్లింలను చంపిన పోలీసులను ఢిల్లీ హైకోర్టు విడిచిపెట్టింది.

గత ఏడాదిలో కొట్టవచ్చినట్లు కన్పించిన మరో అంశం హిందూ మతోన్మాదశక్తులు చర్చిలపై దాడులు చేయటాన్ని పెంచటం. ఒక పద్ధతి ప్రకారం చర్చిలను ధ్వంసం చేశారు. క్రిష్టియన్లను భయభ్రాంతులను చేసే లక్ష్యంతోనే ఈ దాడులు సాగించారు. హక్కుల సంఘాలు వీటిపై చర్య తీసుకోవాలని డిమాండు చేసినపుడు, అసాంఘికశక్తులు సాగించిన చిన్న ఘటనలుగా కొట్టివేయటం ప్రభుత్వానికి పరిపాటి అయింది. ఛత్తీస్‌ఘడ్‌లో సన్యాసినులపై అత్యాచారాలు, క్రిష్టియన్ మతాధిపతులపై దౌర్జన్యాలు కూడా మైనారిటీలలో అభద్రతా భావాన్ని పెంచేందుకు సాగించినవే.

అధికార గద్దెనెక్కటంతో మతోన్మాదశక్తులు పెచ్చరిల్లిపోతున్నాయనీ, అదే సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకుని ప్రజలను మతపర చీలికకు గురిచేస్తున్నాయనీ గత ఏడాది ఘటనలు తెలుపుతున్నాయి.

కొత్త సంస్థలను పుట్టించి, వాటితో మత విద్వేషాలను పెంచుతున్నాయి. హింసరీత్యా తక్కువ స్థాయిలో వుంచి, విస్తృత ప్రాంతాలకు విద్వేషాలను విస్తరిస్తున్నాయి. బీహార్ ఎన్నికల్లో ఓటమి ఈ మతోన్మాదశక్తులను మారుస్తుందని ఆశించిన వారికి తరువాతి ఘటనలు ఆశాభంగాన్నే కలిగించాయి. ప్రభుత్వాధినేతలు ఆర్ఎస్ఎస్ సభకు వెళ్ళి తమ విధేయతను నిరూపించుకొనటం, ఇంకా ఎవరికైనా ఆశలుంటే వాటిపై నీరు చల్లింది.

చాపక్రింద నీరులా విస్తరింపచేస్తున్న మతోన్మాద శక్తుల విషపూరితచర్యలను ఎదుర్కొనేందుకు ప్రజాస్వామిక శక్తులు సంసిద్ధంగా వుండాల్సిన అవసరముంది.

ooooo